

## కేంద్ర మంత్రి వెంటనే క్షమాపణ చెప్పాలి

**టిపిసిసి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రమేష్ బత్తుల**



**వాస్తవ నేస్తం,బోథ్:** 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించినటువంటి పద్మశ్రీ అవార్డుల్లో తెలంగాణకు అన్యాయం చేసి ప్రజా యుద్ధనౌక గద్దర్ కు పద్మశ్రీ ఇవ్వండి అని కోరితే కేంద్ర మంత్రి బండి సంజయ్ గద్దర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తూ గద్దర్ బీజేపీ నాయకులను చంపాడు అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఐక్యం చేసి తెలంగాణ ఆవిర్భావం కోసం తన ఆట మాట లతో తెలంగాణ సాధించిన ప్రముఖ వ్యక్తి పైన ఇలాంటి వ్యాఖ్యలు చేసినందుకుగాను బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలని లేనియెడల ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిషన్ సెల్ సీనియర్ నాయకులు గడ్డల నారాయణ, ఇదాప్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం ఓపీఎస్ విధానం అమలు చేయాలి



**వాస్తవ నేస్తం,భీంపూర్:** కేంద్ర ప్రభుత్వం సీపీఎస్,యూపీఎస్ విధానాలను తక్షణం రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్టీయు మండల శాఖ ప్రతినిధులు మంగళవారం భీంపూర్ తహశీల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. సీపీఎస్ తో ఉద్యోగ,ఉపాధ్యయులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.వినతి పత్రం ఇచ్చిన వారిలో పీఆర్ టీయూ మండల అధ్యక్షుడు ప్రభాకర్,ప్రధాన కార్యదర్శి తిరుపతి,రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి,శ్రీనివాస్,మహేందర్,శ్రీకాంత్,రజిత,రాజు,శుభం,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో జీపీ వర్కర్ ఆత్మహత్య



**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** తాను చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్థాపం చెంది ఓ జీపీ మల్టీ పర్పస్ వర్కర్ మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోరిగామ గ్రామానికి చెందిన బొల్లి రాజు (40) జీపీ మల్టీపర్పస్ వర్కర్ గా పనిచేస్తున్నాడు. గ్రామ సంఘం నుండి అప్పుగా తీసుకున్న డబ్బులు చెల్లించే సమయం దగ్గర పడడంతో తాను అప్పుగా తీసుకున్న డబ్బులు ఎలా చెల్లించాలో తెలియక మనస్థాపం చెంది గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## డిఎల్ఎస్ఏ స్టాల్ ను పరిశీలించిన డిఎల్ఎస్ఏ సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జి సౌజన్య




**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ లో జరుగనున్న నాగోబా జాతరలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న లీగల్ స్టాల్ ను మంగళవారం డిఎల్ ఎస్ఏ సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జి సౌజన్య పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. మూడు రోజులపాటు లీగల్ స్టాల్ లో న్యాయవాదులు జ్యూడిషల్ సిబ్బంది ప్రజలకు ఉచితంగా న్యాయ సలహాలతోపాటు ఉచితంగా న్యాయ సహాయం అందజేస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లీగల్ స్టాల్ ఈనెల 29 నుండి 31 వరకు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉట్నూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు జమీర్ ఖాన్, బానోత్ జగన్ నాయక్, జైవంత్ రావు, కుడెల్లి అశోక్, వినోద్ డిఎల్ఎస్ఏ సిబ్బంది శశికళ, శ్యామ్ లత తదితరులు పాల్గొన్నారు.

## బ్యాట్ పట్టిన పోలీసులు... బంతి విసిరిన జర్నలిస్టులు..!



విధి నిర్వహణలో ఎప్పుడూ బిజీగా ఉండే పోలీసులు, జర్నలిస్టులు సరదాగా ఆటగాళ్ల అవతారమెత్తారు. సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే పోలీస్, ప్రెస్‌కి మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలో జరిగిన క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా సాగింది. ఎప్పుడు విధినిర్వహణలో బిజీ బిజీగా ఉండే పోలీసులు జర్నలిస్టులు ఆడిన క్రికెట్ మ్యాచ్ అందర్నీ ఆకట్టుకుంది.

**- వాస్తవ నేస్తం,బోథ్**



మైదానంగా మారిన గుట్ట ప్రాంతం

# కరిగిపోతున్న "కుప్టి ప్రకృతి" అందాలు!

- పచ్చని గుట్ట అన్యక్రాంతం..
- పర్యావరణానికి పొంచి ఉన్న ముప్పు
- మొరం మాఫియాకు కాసులు కురిపిస్తున్న కుప్టి గుట్టలు
- టిప్పర్ల ద్వారా, ట్రాక్టర్ల ద్వారా మొరం తరలింపు
- కనుమరుగు కానున్న ప్రకృతి సంపద
- రాత్రి సమయాల్లో జోరుగా అక్రమ మొరం దందా
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- అన్ని తెలిసి మౌనం వహిస్తున్న అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు





కుప్టి గుట్టలో జేసీబీతో ఎర్ర మొరం తవ్వకాలు

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్ బ్యూరో :** ఆదిలాబాద్ జిల్లా అంటేనే పచ్చదనానికి పెట్టింది పేరు. అడవులు.. కొండలు... గుట్టలు.. అందమైన జలపాతాలు.. నాలుగు వరుసల జాతీయ రహదారుల వెంట ప్రకృతి రమణీయమైన గుట్టలు..సెలయేళ్ళు... కిలకిల పక్షుల రాగాలు.. చెంగు చెంగున ఎగిరే వన్యప్రాణులు... ఇవన్నీ అదిలాబాద్ జిల్లాకు మణిహారం. పర్యాటక ప్రేమికుల మనసులను ఇట్టే ఆకట్టుకుంటాయి. వారిని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. అలాంటి ప్రకృతి సంపదపై కొందరి కన్ను పడింది.. సంపదను దోచుకెళ్తున్నారు.. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని తెలిసి కూడా సంబంధిత అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుం డటంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అదిలాబాద్ టు నిర్మల్ వైపు వెళ్లే నాలుగు జాతీయ రహదారి నేరడిగొండ మండలంలోని కుప్టి గుట్ట అన్యాక్రాంతం అవుతుతోంది. గుట్టల మధ్యలో కొందరు బడ బాబులు చొరబడ్డారు. అక్రమంగా క్వారీలను ఏర్పాటు చేసారు. విలువైన ఎర్ర మొరంను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ జేబులు నింపు కుంటున్నారు.

### రోజు టిప్పర్ల ద్వారా, ట్రాక్టర్ల ద్వారా మొరం తరలింపు...

కుప్టి ప్రాంతంలో ఎర్ర మొరం నాణ్యమైనది కావడంతో కొందరు పలుకుబడి ఉన్న వ్యక్తులు టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యల్లో పెద్ద పెద్ద టిప్పర్ల ద్వారా ఎర్ర మొరంను తరలిస్తుండడంతో వీరి దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరబూస్తోంది. ఈ ప్రాంతం దగ్గరగా ఉండటం దీనికి తోడు మెరుగైన రోడ్డు సౌకర్యం ఉండటం వరంగా మారింది. పగలు, రాత్రులు అనే తేడా లేకుండా తక్కువ సమయంలో ఎక్కువ ట్రిప్పులు తీసుకెళ్తూ లాభాలను అర్జిస్తున్నారు. ఒక్కొక్క టిప్పర్ మొరం కు రూ.6 వేల నుంచి రూ.8 వెల్ వరకు విక్రయిస్తున్నారు. రాత్రి సమయాల్లో అయితే అడ్డు అరుపు లేకుండా టిప్పర్ల ద్వారా, ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మొరం తరలించి లక్షలు గడిస్తున్నారు.

### నేలకొరుగుతున్న పచ్చని చెట్లు...

కుప్టి గుట్టల మధ్య అక్రమ క్వారీల నేపథ్యంలో విలు వైన పచ్చని చెట్లు నేలకొరుగుతున్నాయి. పకృతిని కాపాడేందుకు ఓ వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తుంటే.. ఇక్కడ మాత్రం అక్రమార్కులు ఉన్న ప్రకృతిని ధ్వంసం చేస్తున్నారు. అక్రమ క్వారీలతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాకరంగా మారాయి. దట్టంగా ఉన్న గుట్టలు కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఈ విధ్వంసం ఇలాగే కొనసాగితే కుప్టి గుట్ట ఆనవాళ్లు కనిపించే పరిస్థితి లేకుండా పోతుంది. మరో వైపు ఎర్ర మొరం కోసం పోటా పోటీగా వెళ్తున్న టిప్పర్ల మూలంగా గ్రామాల్లోని ప్రధాన రహదారులు దెబ్బతింటున్నాయి. ఎర్ర మొరం అక్రమ దందాను అధికారులు అరికడుతారో... లేక అక్రమార్కులకు వత్తాసు పలుకుతారో వేచిచూడాలి మరి...!

## ఆదివాసి సకల కళ సంక్షేమ సంఘానికి ప్రపంచ గిన్నిస్ రికార్డులో స్థానం






**వాస్తవ నేస్తం, ఇచ్చోడ :** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని దుబార్ పేట్ గ్రామానికి చెందిన ఆదివాసి సకల కళ సంక్షేమ సంఘానికి ప్రపంచ గిన్నిస్ రికార్డులో స్థానం లభించింది. ప్రపంచ గిన్నిస్ రికార్డులో ఆదివాసి సకల కళ డైరెక్టర్ కాత్లే శ్రీధర్ బృందానికి అరుదైన గౌరవం దక్కింది. ఈ సందర్భంగా ఆదివాసి సకల కళ సంక్షేమ సంఘం డైరెక్టర్ కాత్లే శ్రీధర్ మంగళవారం ఇచ్చోడలో మాట్లాడారు... దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన జయతి జయ మామ భారతం అనే కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం తర పున మా బృందానికి అవకాశం వచ్చిందని చెప్పారు. ప్రపంచ గిన్నిస్ రికార్డులో స్థానం దక్కడం మా అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. దేశ నలుమూలల నుండి అనేక ప్రాంతాల నుండి కళాకారులు రావడం, మాతో కలవడం మేమంతా కలిసి నృత్యం చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఈ కీర్తిని మాకు దక్కించిన, భారత సంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, సాంస్కృతిక శాఖ సెక్రెటరీ అరునిష్ చావ్లా సంగీత్ నాటాక్ అకాడమీ డాక్టర్ సంధ్యారాణి, వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు గంగారం, ఆనంద్, నగేష్, భాస్కర్, లక్ష్మణ్, సంజీవ్, సందీప్, సాగర్, పరుశురాం, శ్రీకాంత్, ప్రకాష్, గోవింద్ రావ్, గంగారం, విశ్వనాథ్ పాల్గొన్నారని ఆయన తెలిపారు.

ఇచ్చోడ మండలం లోని దుబార్ పేట గ్రామానికి చెందిన. కళాకారులు

